సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం । 23 । మే । 2025



శ్రీవారి సేవలో కోలేటి

గోదావరిఖని: ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం పోలీస్ హౌజింగ్‌బోర్డు మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.



బస్టాండ్ బురదమయం

మంథని: మంథని బస్టాండ్ బురదమయమైంది. బురద ఉన్న చోట మట్టి పోయించకుండా నిర్లక్ష్యం వహించడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గరిష్టం/కనిష్టం
34.0/26.0

వాతావరణం

జిల్లాలో మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

పూడికతీత పనులు త్వరగా పూర్తి చేయాలి



ఓదెలలో పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

సుల్తానాబాద్‌రూరల్/ఓదెల: ఎస్సారెస్పీ కాలువలో పూడికతీత పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. గురువారం సుల్తానాబాద్ మండలం సుద్దాల, ఓదెల మండల శివారులో ఉపాధి హామీలో చేపట్టిన కాలువల పూడికతీత పనులను పరిశీలించారు. వానాకాలంలోగా మెయిన్, డిస్ట్రిబ్యూటరీ కాలువల పనులు పూర్తి చేయాలని సూచించారు. అంతకుముందు ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. డీఆర్డీఏ పీడీ కాళిందిని, ఎంపీడీవోలు దివ్యదర్శన్‌రావు, తిరుపతి, ఎంపీవో షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో గురువారం ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని నోడల్ అధికారి కల్పన తెలిపారు. పరీక్షలకు 1,124 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1,063 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. 61మంది హాజరుకాలేదని వివరించారు.

ఓసీపీల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

గోదావరిఖని(రామగుండం): జిల్లాలో బుధవారం రాత్రి నుంచి కురిసిన వర్షాలతో రామగుండం రీజియన్‌లోని ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఆర్జీ-1 ఏరియాలోని జీడీకే-5 ఓసీపీ, ఆర్జీ-2 ఏరియాలోని ఓసీపీ-3, ఆర్జీ-3 ఏరియాలోని ఓసీపీ-1,2లో ఉత్పత్తికి అంతరాయం కలిగింది.

'ఎల్లంపల్లి'కి స్వల్ప ఇన్‌ఫ్లో



ఎల్లంపల్లి ప్రాజెక్టు

రామగుండం: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో ప్రారంభమైంది. గురువారం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.98 టీఎంసీలు ఉండగా, గతేడాది ఇదే రోజు కేవలం 5.52 టీఎంసీల నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 1,114 క్యూసెక్కులు కాగా, హైదరాబాద్ మెట్రో 331, పెద్దపల్లి-రామగుండం మిషన్ భగీరథ 58, మంచిర్యాల 23, ఆవిరయ్యే నీరు 174 మొత్తం 586 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. గతేడాది ఈ సమయంలో ఏలాంటి ఔట్‌ఫ్లో లేదు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రామచంద్రుడు

ముత్తారం: ఆయిల్‌పాం సాగుతో రైతులకు అధిక దిగుబడులు వస్తాయని ఐఐఓపీఆర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామచంద్రుడు పేర్కొన్నారు. గురువారం ముత్తారం రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. దేశంలో ఆయిల్‌పాం కంటే ఏ ఇతర పంటలకు డిమాండ్ లేదని తెలిపారు. అంతర పంటలుగా బొప్పాయి, మునగ, అల్లం తదితర వాటితో లాభాలు పొందవచ్చన్నారు. ఆయిల్‌పాం చెట్టు నుంచి వచ్చే వ్యర్థాలు మళ్లీ పంటలకు ఉపయోగపడుతాయని వివరించారు. నీటాఫామ్ డీజీఎం సుబ్బారావు మాట్లాడుతూ, ఆయిల్‌పాం సాగులో బిందుసేద్యంతో నీటి ఆదా అవుతుందనన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో ఈ ఏడాదికి 2,500 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. అనంతరం ముత్తారంలోని ఆయిల్‌పామ్ పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, కృషి విజ్ఞానిక కేంద్రం రామగిరి శాస్త్రవేత్త భాస్కర్‌రావు, ఉద్యానశాఖ అధికారి ఎ.జ్యోతి, ఏడీఏ అంజని, ఏవో అనూష, తిరుమల ఆయిల్‌పాం కంపెనీ సీఈవో కళ్యాణ్‌కర్, ఫీల్డ్ ఆఫీసర్ అజయ్, రంజిత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ' ర్యాంక్ వచ్చేనా

- స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల ప్రకటనపై ఉత్కంఠ
- రామగుండం బల్దియాలో ఇప్పటికే పూర్తయిన క్యూసీఐ బృందం పరిశీలన



క్షేత్రస్థాయిలో స్వచ్ఛతస్థాయిని పరిశీలిస్తున్న క్యూసీఐ బృందం(ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ, స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో దేశంలోని పట్టణాలు, నగరాలు, మహానగరాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చడం కోసం ఏటా పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందు కోసం ఢిల్లీ నుంచి ప్రత్యేక క్యూసీఐ బృందం పోటీ చేస్తున్న పట్టణాలు, నగరాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆన్‌లైన్‌లో మార్కులు వేస్తారు. ఈ మార్కుల ఆధారంగానే దేశంలోని మున్సిపాలిటీలకు కేంద్రం స్వచ్ఛత ర్యాంకులను ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా బల్దియా కూడా 'స్వచ్ఛ సర్వేక్షణ్-2024' పోటీలో నిలబడింది. ఇప్పటికే ఢిల్లీ నుంచి వచ్చిన క్యూ సీఐ బృందం ప్రతినిధులు క్షేత్రస్థాయిలో రామగుండంలో స్వచ్ఛతపై పరిశీలన పూర్తి చేశారు. రామగుండంకు ఈసారి మెరుగైన ర్యాంక్ వస్తుందనే ఆశతో అధికారులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. కా గా, త్వరలోనే స్వచ్ఛత ర్యాంకులను ప్రకటించడాని కి కేంద్రం జాబితాను రూపొందిస్తుందని సమాచారం.

ఓడీఎఫ్ ప్లస్ ప్లస్..

రామగుండం నగరపాలక సంస్థకు ప్రస్తుతం ఓడీఎఫ్ ప్లస్ (బహిరంగ మలవిసర్జన రహితం) గుర్తింపు మాత్రమే ఉంది. ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ గుర్తింపు కోసం ఇటీవల కేంద్రానికి బల్దియా అధికారులు దరఖాస్తు చేశారు. రామగుండంలో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్(ఎస్‌టీపీ) పూర్తయినా వినియోగంలోకి రాలేదు. అయితే స్థానిక మల్కాపూర్ శివారులో నిర్మించిన ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (మానవ వ్యర్థాల నిర్వహణ కేంద్రం- ఎఫ్ఎస్‌టీపీ) వినియోగంలోకి తీసుకొచ్చారు. దీంతో ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్ గుర్తింపు వస్తుందని అధికారులు ఆశాభావంతో ఉన్నారు.

మొక్కుబడిగా తడి, పొడి..

రామగుండం బల్దియాలో ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం మొక్కుబడిగా సాగుతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సేంద్రియ ఎరువుల తయారీ ప్రక్రియ కూడా నామమాత్రంగా జరుగుతోంది. కాగా, పారిశుధ్యాన్ని గాడిలో పెట్టడానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తోపాటు బల్దియా స్పెషలాఫీసర్‌గా కలెక్టర్ కోయ శ్రీహర్ష, కమిషనర్‌గా వ్యవహరిస్తున్న అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ చర్యలతోనైనా రామగుండంకు మంచి ర్యాంకు వస్తుందా అనేదానిపై ఉత్కంఠ ఏర్పడింది.

కార్పొరేషన్ ప్రొఫైల్..

- మొత్తం డివిజన్లు: 50
- విస్తీర్ణం: 93.87 చదరపు కిలోమీటర్లు
- జనాభా(2011 లెక్కల ప్రకారం) : 2,29,644
- మురికివాడలు: 71
- అసెస్‌మెంట్ల ప్రకారం గృహాలు: 50,956
- శానిటేషన్ కార్మికులు: 448
- రోజూ వెలువడే చెత్త: 120 మెట్రిక్ టన్నులు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వచ్చిన ర్యాంక్‌లు

ఏడాది	ర్యాంకు
2023	175
2022	136
2021	92
2020	211
2019	192
2018	194
2017	191

ముందస్తు సాగుతో రైతులకు మేలు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లా రైతాంగం ముందస్తు పంటల సాగుకు సమాయత్తం కావాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. పరిస్థితులను బట్టి వానాకాలం పంట నవంబర్ వరకు, యాసంగి పంట మే మొదటివారం దాకా పొడిగించుకోవాల్సి వస్తోందన్నారు. దీంతో రైతులు ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. వాటిని తప్పించుకునేందుకు ముందస్తు సాగుకు సిద్ధం కావాలన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మహిళలు ప్రభుత్వం అందిస్తున్న వడ్డీలేని రుణాలతో వ్యాపార, వాణిజ్యరంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం మహిళాసంఘాల సభ్యులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

సఖి కేంద్రం సేవలు పొందాలి

హింసకు గురయ్యే మహిళలు సఖి కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. రంగంపల్లిలోని సఖి కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. గోదావరిఖనిలో ఓ మహిళ, ఆమె పిల్లలను నిర్బంధించిన మేస్త్రీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గోదావరిఖని ఏసీపీని ఆదేశించారు.

బ్యాంకర్లు సహకరించాలి

జిల్లాలో బ్యాంకు రుణాల కోసం వచ్చేవారిలో ప్రాధాన్యత రంగాలను బట్టి రుణాలందించి సహకరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి బ్యాంకర్లతో సమీక్షించారు. ఇందిరా మహిళాశక్తి పథకం కింద రుణాలను పెంచాలన్నారు. అలాగే కేంద్రం అమలు చేస్తున్న ఉపాధికల్పన, బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. సమావేశాల్లో జిల్లా అధికారులు నరేందర్, కాళిందిని, వేణుగోపాల్, శ్రీనివాస్, అన్నప్రసన్నకుమారి, రంగారెడ్డి, వినోద్‌కుమార్, లీడ్‌బ్యాంకు మేనేజర్ వెంకటేశ్ తదితరులున్నారు.

భాగ్యరెడ్డివర్మ సేవలు చిరస్మరణీయం

- రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝా



నివాళి అర్పిస్తున్న సీపీ అంబర్‌కిషోర్‌ఝా

గోదావరిఖని(రామగుండం): భాగ్యరెడ్డివర్మ సేవలు చిరస్మరణీయమని రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝా అన్నారు. గురువారం భాగ్యరెడ్డివర్మ జయంతిని కమిషనరేట్ మీటింగ్‌హాల్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ, భాగ్యరెడ్డివర్మ హైదరాబాద్ సంస్థానంలో సంఘ సంస్కరణకు కృషి చేసిన మహనీయుడన్నారు. ఆంధ్రసభ స్థాపకుడిగా హైదరాబాద్‌లో దళిత పాఠశాలలను ప్రారంభించి, దళితుల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. అడిషనల్ డీసీపీ రాజు, స్పెషల్‌బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

తిరంగాయాత్రను విజయవంతం చేయాలి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో శుక్రవారం నిర్వహించే తిరంగాయాత్రను విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని జిల్లా కో కన్వీనర్ వెల్లంపల్లి శ్రీనివాసరావు కోరారు. గురువారం అన్ని వర్గాలకు చెందిన సంఘాల ప్రతినిధులకు యాత్ర ఆహ్వానపత్రికలను నాయకులు జంగ చక్రధర్‌రెడ్డి, పర్శ సమ్మయ్య, బండ కరుణాకర్‌లతో కలిసి అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి మొదలయ్యే తిరంగాయాత్రలో రాజకీయాలకతీతంగా పాల్గొని వీరజవాన్లకు మద్దతుగా నిలవాలన్నారు.

వర్షం.. తడిసిన ధాన్యం



జూలపల్లి: కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం



పాలకుర్తి: బసంత్‌నగర్‌లో నేలకూలిన చెట్టు

పెద్దపల్లిరూరల్/మంథని/జూలపల్లి/సుల్తానాబాద్/రామగుండం/పాలకుర్తి/యైటింక్లయిన్‌కాలనీ: జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. జిల్లాకేంద్రంలోని పలు రోడ్లు జలమయమయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. మంథనిలోని లోతట్టు ప్రాంతాల రోడ్ల వెంట వరద పారింది. జూలపల్లి మండలంలోని పలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. రామగుండం పట్టణంలోని పలు కాలనీల్లోకి నీరు చేరింది. పాలకుర్తి మండలం బసంత్‌నగర్ పంచాయతీ భవనం పక్కన చెట్టు ఈదురుగాలులకు నేలకూలింది. రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలో రోడ్లు జలమయమయ్యాయి.

సూపర్ స్పెషాలిటీ వైద్యులను నియమించండి

గోదావరిఖని(రామగుండం): సింగరేణి గోదావరిఖని ఏరియా ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యులను నియమించాలని గురువారం హైదరాబాద్‌లో సంస్థ సీఎండీ ఎన్.బలరాంకు రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ వినతిపత్రం అందజేశారు. బెల్లంపల్లి, రామగుండం రీజియన్‌లోని కార్మిక కుటుంబాలకు ఏరియా ఆస్పత్రి కీలకంగా మారిందన్నారు. ఈనేపథ్యంలో సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నారని వివరించారు. శాశ్వత ప్రతిపాదికన న్యూరో ఫిజిషియన్, పిడియాట్రిషియన్, ఈఎన్‌టీ స్పెషలిస్ట్, ఆప్తామాలజిస్ట్, అదనపు ఫిజీషియన్‌ను నియమించాలన్నారు. అలాగే టూడీ ఈకో, టీఎంటీ టెక్నీషియన్, ఆపరేటర్ నియమించాలని, డయాలసిస్ యూనిట్ విస్తరించాలని కోరారు. ఇందుకు సీఎండీ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.



సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

అప్రమత్తతతోనే కరోనా దూరం

- పౌష్టికాహారం తీసుకోవాలి
- తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలి
- రద్దీ ప్రాంతాల్లో మాస్క్ ధరించడం మేలు
- 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో అన్నప్రసన్నకుమారి



పెద్దపల్లిరూరల్: 'రాష్ట్రంలో ఇప్పటివరకు 'కరోనా' వైరస్ లక్షణాలు కనిపించకపోయినా.. పొరుగున ఉన్న మహారాష్ట్రతో ముప్పు పొంచి ఉంది. అందుకే జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉంటూ రోగనిరోధకశక్తిని పెంచే పోషక విలువలున్న ఆహారపదార్థాలను తీసుకోవాలి' అని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అన్నప్రసన్నకుమారి అన్నారు. చైనా, హాంకాంగ్, బర్మా, టిబెట్ తదితర దేశాల్లో కరోనా వైరస్ వ్యాప్తి చెందుతోంది. మన దేశంలోని కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల్లో వైరస్ వ్యాప్తి చెందుతోందని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. గురువారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా ప్రజల సందేహాలకు సమాధానాలిచ్చారు.

ప్రశ్న: కరోనా వైరస్ మళ్లీ వచ్చే ప్రమాదముందా ?
- రమేశ్ – తొగర్రాయి, తిరుపతి– ఎలిగేడు, ఓదెల రాజు– బ్రాహ్మణపల్లి

డీఎంహెచ్‌వో: ఇప్పటివరకు తెలంగాణలో అలాంటి పరిస్థితి లేదు. కానీ, పొరుగున ఉన్న మహారాష్ట్రలో కరోనా వైరస్ వ్యాపిస్తున్న కారణంగా అక్కడి ప్రజలతో సంబంధాలున్న వారితో వచ్చే ప్రమాదం పొంచి ఉంది. అందుకే ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

ప్రశ్న: రద్దీ ప్రాంతాలు, వివాహ వేడుకలతో ముప్పు వాటిల్లుతుందా ?
- భిక్షపతి – పెద్దపల్లి

డీఎంహెచ్‌వో: ప్రతి ఒక్కరూ కనీస ఆరోగ్యసూత్రాలు పాటించాలి. అందులో కరోనా లాంటి వైరస్ పొంచి ఉన్నపుడు మరింత జాగ్రత్తగా ఉండాలి. గుంపుగా జనం ఉంటే మాస్క్ ధరించాలి. షేక్‌హ్యాండ్ ఇవ్వడం, ఆలింగనం చేసుకోవడం లాంటివి వద్దు.

ప్రశ్న: ప్రజల్లో చైతన్యం పెంచేలా కార్యక్రమాలు చేపడుతున్నారా..?
- సదానందం– పెద్దపల్లి, కుంచం మల్లయ్య– కొలనూర్

డీఎంహెచ్‌వో: ఇప్పటివరకు అలాంటి ఆలోచన చేయలేదు. పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజలను అప్రమత్తం చేసేలా కార్యాచరణ చేపడుతాం. ప్రజలు వీలైనంత వరకు పరిశుభ్రత పాటించడం, తరచూ చేతులు కడుక్కోవడం వంటివి చేయాలి. పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి.

ప్రశ్న: కరోనా వైరస్ కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?
- శ్రీనివాస్– కాల్వశ్రీరాంపూర్, స్నేహలత మాలానీ – పెద్దపల్లి

డీఎంహెచ్‌వో: జిల్లాకు మహారాష్ట్రతోనే ముప్పు ఉందని అనుమానించి కట్టడి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. థర్మా మీటర్లు, శానిటైజర్లు, మాస్కులు, అవసరమైన మందులకు ఇండెంట్ పెట్టాం. అవసరాన్నిబట్టితగు చర్యలు చేపట్టి వైరస్‌ను కట్టడి చేస్తాం.

ప్రశ్న: గతంలో మాదిరిగా వైరస్ తీవ్రత ఉంటుందా..?
- సుద్దాల సతీశ్– సబ్బితం, రమేశ్– ఎక్కలపల్లి

డీఎంహెచ్‌వో: అంత తీవ్రత ఉండదు. తలనొప్పి, గొంతునొప్పి, జ్వరం, ఆకలి మందగించడం, వికారంగా ఉండడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధిగ్రస్తుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. రోగనిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోవాలి.

ప్రశ్న: ఎలాంటి ఆహారం తీసుకుంటే మంచిది..?
- చంద్రమౌళి– కాల్వశ్రీరాంపూర్, ఈదునూరి తిరుమలేశ్– బసంత్‌నగర్, రాజ్‌కుమార్ – పుట్నూర్

డీఎంహెచ్‌వో: పోషకవిలువలు అధికంగా ఉండే పప్పులు, ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలి. పల్లీలు, నువ్వులు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. మజ్జిగ తాగాలి. రోజూ ఉడికించిన కోడిగుడ్డు తినడం మంచిది.

మార్పులకనుగుణంగా బోధించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

జ్యోతినగర్(రామగుండం): విద్యా విధానంలో వస్తున్న నూతన సాంకేతిక మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు విద్యా బోధన చేయాలని స్టేట్ అబ్జర్వర్ ఎస్‌పీ దుర్గాప్రసాద్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్ జెడ్పీ హైస్కూల్‌లో మూడు రోజులుగా జిల్లాలోని 14 మండలాలకు చెందిన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని గురువారం సందర్శించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. శిక్షణలో హెచ్‌ఎంలు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, కోర్సు డైరెక్టర్ జయరాజు, ఎంఈవో చంద్రయ్య, రిసోర్స్‌పర్సన్స్ ఆగయ్య, రాగమణి, భవాని, పురుషోత్తం, టెక్నికల్ పర్సన్ దినేశ్, సీఆర్‌పీలు వెంకటేశ్, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలను వెలికి తీయాలి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): శిక్షణ నైపుణ్యంతో ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని అభ్యసన సామర్థ్యాలను వెలికి తీయాలని రాష్ట్ర పరిశీలకుడు దుర్గాప్రసాద్ అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం జరుగుతుండగా గురువారం జిల్లా సెక్టోరల్ అధికారి కవితతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. రిసోర్స్ పర్సన్స్ నరేశ్, కుమార్, సాధన, ప్రత్యక్ష ఉన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి

పాలకుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని రాష్ట్ర పరిశీలకుడు దుర్గాప్రసాద్ సూచించారు. పాలకుర్తి మండలం బసంత్‌నగర్ జెడ్పీ పాఠశాలలో వేసవి శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

ఉప్పొంగిన భక్తజనం



ఆలయ ఆవరణలో భక్తులు



మూలవిరాట్





మల్యాల: హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా కొండగట్టు అంజన్న సన్నిధి భక్తజనంతో ఉప్పొంగింది. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు రెండు లక్షల మంది భక్తులు తరలివచ్చారు. దీక్షాపరులు మాల విరమణ చేసి క్యూలైన్‌లో అంజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా పోలీసులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. వర్షం కురవడంతో ఆలయ పరిసరాలు చిత్తడిగా మారాయి. హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. స్వామివారిని పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు.



ఇరుముడి సమర్పిస్తున్న స్వాములు



కోనేరులో స్నానాలు చేస్తున్న స్వాములు

క్లుప్తంగా

విద్యుత్‌షాక్‌తో వివాహిత మృతి


ఎర్ర శోభ (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండలం నీలోజిపల్లికి చెందిన వివాహిత ఎర్ర శోభ (48) విద్యుత్‌షాక్‌తో గురువారం మృతిచెందింది. ఏఎస్సై మోతీరామ్‌ తెలిపిన వివరాలు. శోభ స్నానం చేయడానికి ఇంటి దగ్గర ఉన్న స్నానపు గదికి వెళ్లింది. ఆ గదికి ఉన్న ఇనుప డోర్‌ మీదుగా తాత్కాలిక విద్యుత్‌ వైరుతో లైట్‌ ఏర్పాటు చేసుకున్నారు. ఇనుపడోర్‌కు విద్యుత్‌ వైరు తేలి తగిలి ఉంది. దీంతో స్నానానికి వెళ్లి డోర్‌ వేసుకున్న శోభకు విద్యుత్‌ షాక్‌ తగిలి మృతిచెందింది. మృతురాలి భర్త ఎర్ర రాజిరెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని సెస్‌ ఏఏఈ ప్రశాంత్‌ పరిశీలించారు. శోభ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. కుటుంబీకులకు రూ.15వేలు ఆర్థికసాయం అందించారు. కాంగ్రెస్‌ బీసీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్‌, ఏఎంసీ చైర్మన్‌ బోయిని ఎల్లేశ్‌ యాదవ్‌, భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, నాగుల వంశీ తదితరులు ఉన్నారు.

కారు, బైక్‌ ఢీ.. ఒకరి మృతి


జగన్‌ (ఫైల్‌)

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి మండలం రంగాపూర్‌ సమీపంలో కారు, బైక్‌ ఎదురెదుగా ఢీకొన్న ప్రమాదంలో రాఘవాపూర్‌కు చెందిన ట్రాక్టర్‌ డ్రైవర్‌ ఏనుగుల జగన్‌ (25) మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. జగన్‌ లొంకకేసారం గ్రామంలోని తమ బంధువుల ఇంటికి బైక్‌పై బుధవారం రాత్రి వెళ్తుండగా, పెద్దపల్లి వైపు వస్తున్న కారు ఢీ కొట్టింది. వెంటనే స్థానికులు జగన్‌ను పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబీకులను మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పరామర్శించారు. జగన్‌కు భార్య నిఖిత, రెండున్నరేళ్లతో పాటు, మూడునెలల వయస్సుగల కూతుళ్లు ఉన్నారు. మృతుడి తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బసంత్‌నగర్‌ ఎస్సై స్వామి తెలిపారు.

గంజాయి పట్టివేత

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలోని విద్యానగర్‌ బైపాస్‌రోడ్‌లో ఇస్లాంపురకు చెందిన ఎండీ.నబీద్‌ నుంచి 69 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు పట్టణ సీఐ వేణుగోపాల్‌ తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఎస్సై వాహనాల తనిఖీలు చేస్తుండగా నబీద్‌ అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని తనిఖీలు చేయగా గంజాయి లభ్యమైంది. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

మా ఊళ్లో ఏం జరుగుతోంది?

- అందుబాటులోకి మేరీ పంచాయతీ యాప్‌
- నిధుల ఖర్చులో పారదర్శకతకు ప్రాధాన్యం
- ఆదాయ, వ్యయాలను తెలుసుకునే అవకాశం



ప్రభుత్వం రూపొందించిన 'మేరీ పంచాయతీ యాప్‌'లో గ్రామ పంచాయతీల సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుంది. నిధుల వినియోగంలో లోపాలు ఉన్నా, అక్రమాలు జరిగినా యాప్‌ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు. ఈ ఆధారాలతో అధికారులకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

– వీరబుచ్చయ్య, డీపీవో, పెద్దపల్లి


పన్నూర్‌ గ్రామపంచాయతీ కార్యాలయం

రామగిరి(మంథని): గ్రామ పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులను గ్రామస్తులు తెలుసుకునేందుకు కేంద్రప్రభుత్వం మేరీ పంచాయతీ(నా పంచాయతీ) యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఆదాయ, వ్యయాల్లో పారదర్శకత పాటించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వాలు విడుదల చేసే నిధులను పాలకవర్గాలు ఎలా ఖర్చు చేస్తాయనే సమాచారం నేరుగా తెలుసుకోవచ్చు. యాప్‌ను 2019లో రూపొందించినా సాంకేతిక కారణాలతో కొంత సమాచారం అందించలేకపోయింది. ప్రస్తుతం సమగ్ర సమాచారంతో యాప్‌ అందుబాటులోకి వచ్చింది.

పారదర్శక పాలన..

గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులతో అభివృద్ధి పనులు చేపడతారు. వాటి వినియోగానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో పొందుపర్చాలని, తద్వార గ్రామాల్లో పారదర్శకపాలన సాగుతుందని అధికారులు చెబుతున్నారు. నిధుల వివరాలు ఆన్‌లైన్‌లో ఉండటంతో గ్రామాభివృద్ధికి ఎలాంటి పనులు చేపడుతున్నారో గ్రామస్తులు తెలుసుకోవచ్చు. వివరాల నమోదు సమయంలోనే జీపీఆర్‌ఎస్‌ ద్వారా గుర్తించే అవకాశం ఉండటంతో అక్కడి పనులకు కేటాయించిన నిధులను ఇతరచోట్ల వినియోగించేందుకు వీలు ఉండదు. పాలకవర్గాలు సైతం పొరపాట్లు చేయడానికి అవకాశం ఉండదు. పాలకులు, అధికారులు తప్పుడు నివేదికలు రూపొందిస్తే ప్రశ్నించడానికి వీలు కలుగుతుంది.

అన్ని వివరాలు నిక్షిప్తం

గ్రామ పంచాయతీల నిధుల వివరాలు మాత్రమే కాకుండా సర్పంచ్‌(ప్రస్తుతం లేరు), కార్యదర్శి, గ్రామ కమిటీలు, ఆస్తుల వివరాలన్నీ యాప్‌ ద్వారా తెలుసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా మంజూరు చేసే నిధుల వివరాలు, దేనికి ఎంతఖర్చు చేశారు, పనులు ఏదశలో ఉన్నాయన్న వివరాలు ఇందులో నమోదై ఉంటాయి. నిధుల్లో ఎక్కువగా కార్మికులు, సిబ్బంది వేతనాలు, ఇతర ఖర్చులు యాప్‌లో పొందుపర్చుతారు. ఇవే కాకుండా వచ్చే ఏడాది అంచనా వ్యయాల నమోదుతో పాటుగా, గ్రామ సభల వివరాలు సైతం యాప్‌లో అందుబాటులో ఉంటాయి.

కొరవడిన అవగాహన

మేరీ పంచాయతీ యాప్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించడంలో అధికారులు వెనుకబడ్డారు. చాలా వరకు గ్రామాల్లో చదువుకున్న యువతకు తప్ప మరొకరికి ఈ యాప్‌ ఉన్నట్లు కూడా తెలియదంటున్నారు. యాప్‌పై అవగాహన లేక చాలామంది తమ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి వివరాలను తెలుసుకోలేకపోతున్నారు.

ప్లేస్టోర్‌ ద్వారా డౌన్‌లోడ్‌.

స్మార్ట్‌ ఫోన్‌లోని ప్లేస్టోర్‌ యాప్‌లో మేరీ పంచాయతీ పేరిట సెర్చ్‌ చేయగానే వచ్చే యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసుకున్నాక లాగిన్‌ అవ్వాలి. ఆ వెంటనే ఫైనాన్షియల్‌ ఇయర్‌, స్టేట్‌, జిల్లా, మండలం, పంచాయతీ వివరాలు కనిపిస్తాయి. వాటిని నమోదు చేయగానే ఆయా పంచాయతీల సమాచారం కనిపిస్తుంది. గ్రామం పేరు, లేదంటే పిన్‌కోడ్‌తో గ్రామ పంచాయతీ పూర్తి వివరాలను తెలుసుకునే వీలుంటుంది. చేసిన పనుల ఫొటోలను యాప్‌లో పొందుపరుస్తారు. పల్లెపాలనలో పారదర్శకతకు ఈ యాప్‌ ఎంతోగానో ఉపయోగపడుతుంది.

అవగాహన కల్పించాలి



పంచాయతీల పద్దుల వివరాలు తెలుసుకునేందుకు ఓ యాప్‌ ఉందనే విషయం చాలామందికి తెలియదు. దీంతో నిధుల వినియోగం విషయంలో అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రజలే నేరుగా నిధుల వివరాలను తెలుసుకునేలా యాప్‌పై అధికారులు అవగాహన కల్పించాలి.

– బొంకూరి పోశం, కల్వచర్ల, రామగిరి మండలం

అభివృద్ధికి నిదర్శనం కరీంనగర్‌ రైల్వేస్టేషన్‌


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌, రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌
- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ

సాక్షిప్రతినిధి,కరీంనగర్‌/కరీంనగర్‌రూరల్‌: ఎన్‌డీఏ ప్రభుత్వ హయంలో రైల్వేస్టేషన్లు అభివృద్ధి చెందాయనడానికి కరీంనగర్‌ రైల్వే స్టేషన్‌ ఆధునీకరణే నిదర్శనమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని బికనూర్‌ నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కరీంనగర్‌ రైల్వేస్టేషన్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ ప్రత్యక్షంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌ మాట్లాడుతూ జమ్మికుంట రైల్వేస్టేషన్‌ను సైతం అమృత్‌ భారత్‌ పథకంలో ఆధునీకరిస్తామని తెలిపారు. జూన్‌ నెలాఖరులోగా ఉప్పల్‌ ఆర్వోబీ పూర్తి చేస్తామని, కరీంనగర్‌– హసన్‌పర్తి రైల్వేలైన్‌ నిర్మాణానికి రూ.1480 కోట్లు అవసరమని డీపీఆర్‌లో పేర్కొన్నట్లు తెలిపారు. తిరుపతి రైలును వారంలో నాలుగుసార్లు నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ మాట్లాడుతూ తాను ఎంపీగా ఉన్నప్పుడు కరీంనగర్‌ రైల్వేస్టేషన్‌కు కృషి చేశానని, ప్రస్తుతం తిరుపతికి వారంలో రెండు పర్యాయాలు నడుస్తున్న రైలును ప్రతిరోజూ నడిపించేలా చూడాలన్నారు. కరీంనగర్‌– ముంబయి, షిర్డీకి రైలు నడిపించాలన్నారు. అనంతరం రైల్వేస్టేషన్‌లో పర్యటించి లిఫ్టులు, ఎస్కలేటర్లు, బుకింగ్‌ కౌంటర్లను మంత్రులు పరిశీలించారు. ఎమ్మెల్సీలు చిన్నమైల్‌ అంజిరెడ్డి, మల్క కొమురయ్య, సీపీ గౌస్‌ ఆలం, రైల్వే రీజినల్‌ మేనేజర్‌ గోపాలకృష్ణన్‌, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్‌, మాజీ మేయర్‌ వై.సునీల్‌రావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ లేఖలకే పరిమితం

బీఆర్‌ఎస్‌ నాయకులు గతంలో ప్రతీ విషయానికి లేఖలు రాసి చేతులు దులుపుకున్నారే తప్పా ఎలాంటి అభివృద్ధి చేయలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ అన్నారు. ప్రస్తుతం రైల్వేస్టేషన్ల అభివృద్ధి తమవల్లే జరుగుతోందని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. మాటలు కాదు.. బుల్లెట్‌ దిగిందా లేదా అనేది చూడాలని కోరారు. ఎన్‌డీఏ ప్రభుత్వ హయంలో రైల్వేస్టేషన్లు అభివృద్ధి చెందాయని చెప్పడానికి కరీంనగర్‌ రైల్వే స్టేషన్‌ ఆధునీకరణే నిదర్శనమన్నారు.

సభ ఏర్పాట్లలో విఫలం

కరీంనగర్‌ రైల్వే స్టేషన్‌లో ప్రారంభోత్సవ సభ నిర్వహణలో రైల్వేఅధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ప్రెస్‌ గ్యాలరీ కుర్చీల్లో రాజకీయ నాయకులతో పాటు ఇతరులు కూర్చోవడంతో మీడియా ప్రతినిధులు నిలుచునే పరిస్థితి ఏర్పడింది. స్నాక్స్‌, తాగేందుకు మంచినీళ్లు ఇవ్వకపోవడంతో పలువురు ఇబ్బందులకు గురయ్యారు. సభకు తీగలగుట్టపల్లి నుంచి పెద్దసంఖ్యలో మహిళలను స్థానిక బీజేపీ నాయకులు తీసుకురాగా.. రైల్వేస్టేషన్‌లోకి పోలీసులు, రైల్వే సిబ్బంది అనుమతించకపోవడం వివాదాస్పదంగా మారింది. దక్షిణ మధ్య రైల్వే అధికారులే సభ బాధ్యతలు చూసుకున్నారని, తమకు సంబంధం లేదని స్థానిక రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంపై పిడుగు


గర్భగుడిలో ఏర్పడిన రంధ్రం



- ధ్వంసమైన ఆలయ శిఖరాలు

ఇబ్రహీంపట్నం: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోధూర్‌లో బుధవారం అర్ధ రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గ్రామంలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంపై పిడుగు పడింది. ఈ ఘటనలో ఆలయ శిఖరం పగిలిపోయింది. పిడుగుధాటికి గర్భగుడిలోకి రంధ్రం ఏర్పడింది. ఆలయానికి సుమారు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

వర్షానికి కూలిన ఆలయం పైకప్పు


పై కప్పు కూలిన ఆలయం

ఇల్లంతకుంట(మానకొండూర్‌): మండలంలోని రేపాకలోని శ్రీనృసింహస్వామి ఆలయం పైకప్పు గురువారం కూలింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అతి పురాతన ఆలయం గోడలు నానిపోయి పైకప్పు గర్భగుడిలో కూలింది. దాదాపు 800 ఏళ్ల క్రితం నాటి ఆలయమని గ్రామ కాంగ్రెస్‌ నాయకుడు మల్లేశం తెలిపారు.

నేటి నుంచి పలు సూపర్‌ ఫాస్ట్‌ ఎక్స్‌ప్రెస్‌ రైళ్లు రద్దు

రామగుండం: మహబూబాబాద్‌ సమీపంలో చేపట్టే ట్రాక్‌ పునరుద్ధరణ, తదితర పనుల నేపథ్యంలో న్యూఢిల్లీ నుంచి రామగుండం మీదుగా చెన్నై వైపు వివిధ రూట్లలో నడిచే సూపర్‌ఫాస్ట్‌ ఎక్స్‌ప్రెస్‌ రైళ్లను ఈనెల 23 నుంచి 29 వరకు రద్దు చేస్తున్నట్లు గురువారం రాత్రి దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. రైలు నం.17033/17034 భద్రాచలం రోడ్‌- సిర్‌పూర్‌ కాగజ్‌నగర్‌ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్‌ రైలును 23 నుంచి 29 వరకు రద్దు చేశారు. నం.20819 పూరి–ఓఖా ఎక్స్‌ప్రెస్‌ 25న, నం.20820 ఓఖా–పూరి సూపర్‌ ఫాస్ట్‌ ఎక్స్‌ప్రెస్‌ 28న, నం.16093 చెన్నై సెంట్రల్‌–లక్నో రైలు 27న రద్దు చేశారు. నం.22647 కోర్బా–తిరువనంతపురం రైలు 28న, నం.22648 తిరువనంతపురం–కోర్బా రైలు 26న, నం.12511 గోరఖ్‌పూర్‌- కొచ్చువెళ్లి రైలు 22,2325న, నం.12512 కొచ్చువెళ్లి–గోరఖ్‌పూర్‌ 25,27,28న, నం.20805 విశాఖ–న్యూఢిల్లీ రైలు 27,28న, నం.20806 న్యూఢిల్లీ- విశాఖపట్టణం రైలు 27,28న, నం.20803 విశాఖ–దుర్గ్‌ రైలు 22న, నం.20804 దుర్‌-విశాఖ రైలు 25న, నం.16031 చెన్నై సెంట్రల్‌- కాట్రా శ్రీవైష్ణోదేవి రైలు 25,28,29న, నం.16032 కాట్రా–చెన్నై సెంట్రల్‌ రైలును 27న రద్దు చేశారు.

పోలీసుల అదుపులో మావో సానుభూతిపరుడు?

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్‌ మండలం పొలాస శివారులో రెండు రోజుల క్రితం ఓ మావోయిస్ట్‌ సానుభూతిపరుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, అతని నుంచి జిలెటిన్‌ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నారని సమాచారం. జగిత్యాల అర్బన్‌ మండలం ధరూర్‌లో 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఓ వ్యక్తి బండ రాళ్లకు డ్రిల్లింగ్‌ వేసి జిలెటిన్‌ స్టిక్స్‌తో పేల్చుతూ ఉపాధి పొందుతున్నాడు. ఈ తరుణంలో ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రంలోని కొంతమంది మావోయిస్టులతో ఇతనికి సంబంధాలు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం అతడి నుంచి జిలెటిన్‌ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది. అనుమానితుడు కొద్దికాలంగా ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రంలోనే నివాసం ఉంటున్నట్లు వెల్లడైనట్లు సమాచారం. ఇతడికి మావోలతో ఉన్న సంబంధాలపై పోలీసు అధికారులు లోతైన విచారణ చేస్తున్నట్లు సమాచారం.

లారీ బీభత్సం

- ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టిన లారీ


ఢీ కొన్న లారీలు


లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌

కరీంనగర్‌రూరల్‌: రాజీవ్‌రహదారిలో గురువారం రాత్రి ఓ లారీ బీభత్సం సృష్టించింది. ఎదురుగా వస్తున్న లారీతో పాటు కారును ఢీకొట్టడంతో ఒక లారీ డ్రైవర్‌ మృతి చెందగా.. మరో లారీ డ్రైవర్‌ పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇరుకుల్ల వద్ద కరీంనగర్‌ నుంచి పెద్దపల్లికి వస్తున్న లారీ అదుపు తప్పి డివైడర్‌పై నుంచి వెళ్లి ఎదురుగా వస్తున్న కారు, లారీని ఢీకొట్టింది. కారు పల్టీలు కొట్టి పక్కకు పడిపోగా.. లారీల ఇద్దరు డ్రైవర్లు క్యాబిన్‌ల్లో ఇరుక్కుపోయారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. రెండు లారీల క్యాబిన్ల నుంచి డ్రైవర్లను బయటకు తీసి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఢీకొట్టిన లారీ డ్రైవర్‌ పరిస్థితి విషమంగా ఉండగా, ఎదురుగా వస్తున్న లారీ డ్రైవర్‌ జిన్నా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారులో ఉన్న ఇద్దరి పరిస్థితి కూడా విషమంగా ఉంది.

మ్యాన్‌హోల్‌లో పడిన వృద్ధుడు


మ్యాన్‌హోల్‌లో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది


వృద్ధుడిని బయటకు తీస్తున్న సిబ్బంది

- రక్షించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని బైపాస్‌రోడ్‌లో నాయీబ్రాహ్మణ సంఘం భవనం ముందుగల మ్యాన్‌హోల్‌లో ఓ వృద్ధుడు పడిపోయాడు. పట్టణానికి చెందిన ముకుందరెడ్డి తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా వరదనీరు ఎక్కువ రావడంతో మ్యాన్‌హోల్‌లో పడిపోయాడు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని వృద్ధుడిని, ద్విచక్ర వాహనాన్ని గంటపాటు శ్రమించి బయటకు తీశారు. వృద్ధుడికి స్వల్ప గాయాలు కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సకాలంలో స్పందించడంతో వృద్ధుడు ప్రాణాలతో బయటపడ్డాడు.


రాజన్న తిప్పాపూర్‌ గోశాలలో బురదలో కోడెలు

వసతికి మించి !

- గోశాలలో ఇబ్బంది పడుతున్న కోడెలు
- చిన్నపాటి చినుకులకే బురదమయం
- నిలిచిన రైతులకు పంపిణీ కార్యక్రమం
- సౌకర్యాలు లేక అవస్థలు

వేములవాడఅర్బన్‌: దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామికి భక్తులు కోడెమొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. చాలా మంది భక్తులు తమ అభీష్టాలు నెరవేరితే రాజన్నకు నిజకోడె సమర్పిస్తామని మొక్కుకుంటారు. ఇలా భక్తులు ద్వారా ప్రతినిత్యం పదుల సంఖ్యలో కోడెలు రాజన్న గోశాలలకు వచ్చి చేరుతున్నాయి. వీటి సంరక్షణ కోసం గుడిచెరువు కట్ట వద్ద ఓ గోశాల, తిప్పాపూర్‌లో మరో గోశాలను ఏర్పాటు చేశారు. భక్తులు కోడెమొక్కులు చెల్లించుకునేందుకు గుడిచెరువు కట్ట గోశాల నుంచి షిఫ్టులవారీగా ఆలయానికి తీసుకెళ్తుంటారు. మిగతా కోడెలు తిప్పాపూర్‌లోని గోశాలకు తరలిస్తుంటారు.

తిప్పాపూర్‌లో అపరిమిత కోడెలు

వేములవాడ మున్సిపల్‌ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలో 400 నుంచి 500 కోడెలకు వసతి ఉంది. కానీ ఇక్కడ ప్రస్తుతం 900 నుంచి 1000 వరకు కోడెలు ఉన్నాయి. వసతికి మించి రెండింతలు కోడెలు ఉండడంతో సౌకర్యాల కల్పనకు ఇబ్బందిగా మారింది. దీనికి తోడు రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో గోశాలలోని పరిసరాలు బురదమయంగా మారాయి.

నిలిచిన కోడెల పంపిణీ

రాజన్న గోశాలలో కోడెల సంఖ్య పెరిగిపోవడంతో 2024, జూలై నెలలో ఆసక్తి గల రైతులకు రెండు కోడెల చొప్పున పంపిణీ చేశారు. తర్వాత మధ్యలో ఓ సారి పంపిణీ చేసిన అధికారులు అనంతరం నిలిపివేశారు. 2024, డిసెంబర్‌లో రైతులకు ఇచ్చిన కోడెలు వరంగల్‌ జిల్లా గీసుకొండ మండలం మనుగొండ గ్రామంలో పక్కదారి పట్టినట్లు అక్కడి పోలీసులు గుర్తించారు. దీంతో అప్పటి నుంచి కోడెల పంపిణీ నిలిపివేశారు.

వసతులు అంతంతే..

తిప్పాపూర్‌లోని గోశాలలో సగభాగం సీసీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. కోడెలు ఉండే షెడ్ల ముందు భాగం సీసీరోడ్డు పనులు ఇప్పుడే మొదలుకావడంతో వర్షానికి కోడెలు ఉన్న స్థలం బురదమయంగా మారింది. ఆ బురదలోనే కోడెలు ఉంటున్నాయి. దీనికితోడు నిత్యం భక్తులు సమర్పిస్తున్న నిజకోడెలు గోశాలకు వచ్చి చేరుతున్నాయి. భక్తులు సమర్పిస్తున్న నిజకోడెల్లో చిన్నకోడెలు ఉండడంతో సమస్యగా మారిందని ఆలయ అధికారులు తెలుపుతున్నారు. చిన్నకోడెలు త్వరగా అనారోగ్యానికి గురవుతున్నాయని, చిన్నకోడెలను తీసుకురావద్దని కోరుతున్నా భక్తులు వినడం లేదని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

పంపిణీకి చర్యలు తీసుకుంటాం



వేములవాడ రాజన్న గోశాలలో కోడెల సంఖ్య పెరగడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో రాజన్న కోడెలను అర్హులైన రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– వినోద్‌రెడ్డి, వేములవాడ రాజన్న ఆలయ ఈవో


సహస్ర దీపాలంకరణ


ఆంజనేయస్వామి ఉత్సవమూర్తికి ఊంజల్‌ సేవలో అర్చకులు

కొండగట్టులో సహస్ర దీపాలంకరణ

- స్వామివారికి ఊంజల్‌ సేవ

మల్యాల: కొండగట్టులో ఈనెల 20 నుంచి నిర్వహిస్తున్న హనుమాన్‌ పెద్ద జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉత్సవ మూర్తికి ఊంజల్‌ సేవ నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర స్వామికి శావ నిర్వహించారు. ఆలయంలో సహస్ర దీపాలంకరణ నిర్వహించారు.

అంజన్న సన్నిధిలో ప్రముఖుల పూజలు

హనుమాన్‌ పెద్ద జయంతి సందర్భంగా పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. పొన్నం సత్తయ్య చారిటబుల్‌ ట్రస్టు ఆధ్వర్యంలో ఆరు వేల లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు.